క్లుప్తంగా

పద్మారావుగౌడ్‌కు ఆహ్వానం



ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న సంఘం సభ్యులు

లాలాపేట: తెలంగాణ వంజరి సంఘం నాయకుల ప్రతినిధి బృందం శనివారం డిప్యూటీ స్పీకర్‌ పద్మారావు గౌడ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఫిబ్రవరి 4న ఉప్పల్‌ భగాయత్‌లో వంజరి భవన్‌ భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌, వెంకటేశం, అమరేందర్‌, ముత్తయ్య, వెంకటేష్‌, సతీష్‌ పాల్గొన్నారు.

రూ. లక్ష విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న చీర శ్రీకాంత్‌

రాంగోపాల్‌పేట్‌: సికింద్రాబాద్‌ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో రుద్రాక్ష మండప నిర్మాణానికి కార్పొరేటర్‌ చీర సుచిత్ర శ్రీకాంత్‌ దంపతులు శనివారం రూ.లక్ష విరాళాన్ని ఈవో గుత్తా మనోహర్‌రెడ్డికి అందజేశారు. దేవాలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని చెప్పారు. దేవాలయంలో జరుగుతున్న కోటి కుంకుమార్చన పూజల్లో కార్పొరేటర్‌ చీర సుచిత్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి 11 కిలోల కుంకుమ, 11 కిలోల పసుపు సమర్పించారు. దేవాలయంలో జరుగుతున్న పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ ఆవిష్కరణ



ఉస్మానియా యూనివర్సిటీ: కృష్ణ జలాల్లో వాట కోసం ఈ నెల 30, 31న తెలంగాణ జన సమితి (టీజేఎస్‌) తలపెట్టిన చలో ఢిల్లీ, మౌన దీక్షలో కార్యక్రమంలో పాల్గొనేందుకు 300 మంది విద్యార్థులు తరలివెళ్తున్నట్లు విద్యార్థి జన సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు సర్దార్‌ వినోద్‌కుమార్‌ తెలిపారు. శనివారం ఆర్ట్స్‌ కాలేజీ చలో ఢిల్లీ విజయవంతం కోసం రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

నేడు శ్రీనివాస కల్యాణ మహోత్సవం

పంజగుట్ట: శ్రీ శ్రీనివాస కల్యాణం ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఈనెల 29 (నేడు) న మోతీనగర్‌ కమ్యూనిటీ హాల్‌లో శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని ట్రస్ట్‌ సెక్రటరీ బిరుదురాజు కృష్ణంరాజు తెలిపారు. తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

బహుజన రాజ్య స్థాపనే ఆర్‌పీఐ లక్ష్యం

పంజగుట్ట: బహుజనుల రాజ్య స్థాపనే లక్ష్యంగా రిపబ్లికన్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా (ఆర్‌పీఐ) పని చేస్తుందని పార్టీ తెలుగు రాష్ట్రాల కన్వీనర్‌ పేరం శివనాగేశ్వర రావు గౌడ్‌ అన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం ఫిబ్రవరి 3న కాచిగూడ, మున్నూరు కాపు సంఘం కల్యాణ మండపంలో 'బహుజన రాజ్యాధికారం' పేరుతో భారీ సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రామ్‌దాస్‌ అథవాలె హాజరవుతారని చెప్పారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శివనాగేశ్వర రావు గౌడ్‌ విలేకరులతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో 119 శాసన సభ, 17 ఎంపీ స్థానాలకు పోటీ చేస్తామన్నారు. 3వ తేదీన బహుజన రాజ్యాధికారం కోసం సూచనలు, సలహాలు, నూతన రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక, తెలంగాణ కార్యవర్గం ఎన్నిక జరుగుతుందన్నారు.

డబుల్‌ ఓట్ల తొలగింపు ప్రక్రియ షురూ!

ముషీరాబాద్‌: ఒకే వ్యక్తికి చెందిన ఓటు వివిధ పోలింగ్‌ బూత్‌లు, పక్క డివిజన్‌, వేరొక నియోజకవర్గంలో ఉన్నట్‌లైతే వాటిని తొలగించే కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–15 అధికారులు శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించిన సమావేశాన్ని శనివారం సాయంత్రం కార్యాలయంలో డీఎంసీ హరికృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ తరపున అసెంబ్లీ కన్వీనర్‌ రమేష్‌రావు, కాంగ్రెస్‌ తరపున భోలక్‌పూర్‌ డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ వాజీద్‌ హుస్సేన్‌, బీఆర్‌ఎస్‌ తరపున సీనియర్‌ నాయకులు కొండపల్లి మాధవ్‌, శ్యామ్‌సుందర్‌, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, బీఎస్‌పీ తరపున నరేందర్‌తో పాటు ఎంఐఎం, సీపీఎం, సీపీఐ ప్రతినిధులు హాజరయ్యారు.

సమస్యలుంటే నా నంబర్‌కే ఫోన్‌ చేయండి

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

అమీర్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తానని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ స్పష్టం చేశారు. అమీర్‌పేట డివిజన్‌లో శనివారం ఆయన పర్యటిస్తూ ఆయా ప్రాంతాల్లోని ప్రజలతో మాట్లాడుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం మంత్రి మాట్లాడుతూ.. తాను నిరంతరం ప్రజల మధ్యనే ఉంటానని ఏ సమస్య వచ్చినా నేరుగా తనకే ఫోన్‌ చేయాలని నంబర్‌ ఇచ్చారు. మంచినీటి సమస్యలో అంతరాయం లేకుండా చూడాలని, వీధి లైట్లకు మరమ్మతులు చేపట్టి, విద్యుత్‌ తీగలకు అడ్డుగా ఉన్నా చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. కాలనీల వాసులు ప్రతి నెల సమావేశం ఏర్పాటు చేసుకుని సమస్యలపై చర్చించుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. మంత్రి వెంట మాజీ కార్పొరేటర్‌ నామన శేషుకుమారి, జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌, డీసీ మోహన్‌రెడ్డి, ఇందిర, హరిశంకర్‌, రమేష్‌, విష్ణు సాగర్‌ ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం..

సనత్‌నగర్‌: సనత్‌నగర్‌లో లాధా అపార్ట్‌మెంట్‌ నుంచి సివిటాస్‌ అపార్ట్‌మెంట్‌ వరకు రూ.31లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులు, జెక్‌ కాలనీలో రూ.30లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను మంత్రి తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ స్థానిక కార్పొరేటర్‌ కొలను లక్ష్మీబాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎల్‌ఐజీ క్వార్టర్స్‌లోని పార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పార్కును శుభ్రం చేయాలని, విద్యుత్‌ స్తంభాలను తొలగించి సిమెంట్‌ స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌, డీసీ మోహన్‌రెడ్డి, ఈఈ ఇందిర, జలమండి జీఎం హరిశంకర్‌, టౌన్‌ప్లానింగ్‌ ఏసీపీ రమేష్‌ పాల్గొన్నారు



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

బన్సీలాల్‌పేట్‌లో నేడు పర్యటన

బన్సీలాల్‌పేట్‌: బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌లో ఈ నెల 29 ఆదివారం రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ పర్యటిస్తారని డివిజన్‌ అధ్యక్షులు వెంకటేశన్‌లో ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 లకు జయనగర్‌, ఐడీహెచ్‌ కాలనీల్లో పర్యటిస్తారన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ తన సొంత నిధులతో జయనగర్‌, ఐడిహెచ్‌ కాలనీల్లో రెండు దేవాలయాలను నిర్మిస్తున్నారు. అందులో భాగంగా సదరు దేవాలయ పనులకు మంత్రి భూమి పూజ చేస్తారన్నారు.



కాలనీకి వచ్చిన మంత్రికి హారతి ఇస్తున్న మహిళలు

తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయన్న

రాంగోపాల్‌పేట్‌: శివాజీనగర్‌లోని దంగుబస్తీకి నీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తామని కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే సాయన్న అన్నారు. రూ.3.05 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన బోర్‌ పనులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ బోర్‌ వెల్‌ నిర్మాణంతో పెరుమాళ్‌ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి చెందిన కల్యాణ మండపంతో పాటు ఈ బస్తీ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బోర్‌వెల్‌, మోటర్‌, పైప్‌లైన్‌ వేసి నీటి సరఫరా చేయిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే కల్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే బస్తీలో ఎస్‌ఎస్‌ ఫ్లోరింగ్‌, పబ్లిక్‌ టాయిలెట్లు కావాలని బస్తీ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తేగా వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి కొత్తవి ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవో సత్యమూర్తి, అభివృద్ధి కమిటీ చైర్మన్‌ నర్సారెడ్డి, సభ్యులు నరేందర్‌రెడ్డి, తేజ్‌పాల్‌, నరేష్‌, అజయ్‌ యాదవ్‌, నిత్యానంద్‌, మురళి యాదవ్‌, సురేష్‌, నాయకులు టీఎన్‌ శ్రీనివాస్‌, గౌరిశంకర్‌, శేఖర్‌ ముదిరాజ్‌, అజయ్‌ పాల్గొన్నారు.

విద్యుత్‌ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం ఇస్తున్న కాలనీ వాసులు

లాలాపేట: పవర్‌ బోర్‌కు సంబంధించిన విద్యుత్‌ బిల్లులను జీహెచ్‌ఎంసీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఉప్పల్‌ మల్లాపూర్‌ 5వ డివిజన్‌కు చెందిన జీఎస్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీ ఫేస్‌–1 వాసులు శనివారం తార్నాకలోని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్‌ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హౌజింగ్‌ స్కీంలో భాగంగా ఏర్పాటు చేసిన నాలుగు పవర్‌ బోర్ల మోటార్లకు గత కొంత కాలంగా విద్యుత్‌ చెల్లించకపోవడంతో ఒక్కొక్క మోటారుకు రూ. లక్షకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్న కారణంగా విద్యుత్‌ నిలిపివేయడంతో తమకు తాగు, వాడుక నీటికి ఇబ్బందిగా మారిందన్నారు. ఇప్పటి నుంచైనా ఆ పవర్‌ బోర్లకు జీహెచ్‌ఎంసీ క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించేలా చూడాలని వినతిలో కోరగా స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో ఆ ప్రాంతానికి వచ్చి సమస్యను పరిశీలిస్తామన్నారు.

మెరుగైన పర్యావరణానికి సైక్లింగ్‌ను ప్రోత్సహిస్తున్నాం

సనత్‌నగర్‌: ప్రపంచ వ్యాప్తంగా మెరుగైన పర్యావరణం ఉండే సమాజం కోసం సైక్లింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్లు వరల్డ్‌ సైక్లింగ్‌ అలయన్స్‌ (డబ్ల్యూసీఏ) ప్రెసిడెంట్‌, యురోపియన్‌ పార్లమెంటు మాజీ సభ్యుడు సర్‌ గ్రాహం వాట్సన్‌ అన్నారు. ఆజాదీకా అమృతోత్సవ్‌లో భాగంగా ఈ నెల 29వ తేదీన సైక్లింగ్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో నిర్వహిస్తున్న సైక్లోథాన్‌ కోసం ఆయన హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సైక్లోథాన్‌లో పాల్గొనేందుకు రావడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని చెప్పారు. భారతదేశంలో సైక్లింగ్‌ను ప్రోత్సహించేందుకు డబ్ల్యూసీఏ ఉపాధ్యక్షులు డీవీ మనోహర్‌ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆధునిక జీవనశైలి, వాతావరణ మార్పుల కారణంగా భారతదేశంలో స్థూలకాయం, మధుమేహం లాంటివి పెరిగిపోయి ఎంతో మంది మరణిస్తున్నారని తక్కువ దూరం, ట్రాఫిక్‌ రద్దీలను తప్పించుకోవడంతో పాటు మంచి ఆరోగ్యం కోసం సైకిళ్లను ఉపయోగించాలని తెలిపారు. డీవీ మనోహర్‌ మాట్లాడుతూ.. తాము 12 ఏళ్ల క్రితం హైదరాబాద్‌లో సైక్లింగ్‌ విప్లవాన్ని ప్రారంభించామని యువత, సీనియర్‌ సిటిజన్ల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీవీ మనోహర్‌

లోన్‌ ఇప్పిస్తామని మోసం

బాధితుడి ఫిర్యాదు

అమీర్‌పేట: లోన్‌ ఇప్పిస్తామని మోసం చేశారంటూ ఓ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఎల్లారెడ్డిగూడకు చెందిన వ్యాపారి సూర్యవెంకట శశిరెడ్డి రూ.5 లక్షల లోన్‌ కోసం గూగుల్‌లో శోధించగా ఇండియా బుల్స్‌ లోన్‌ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఫోన్‌ నెంబర్‌ కనిపించింది. ఆ నెంబర్‌కు ఫోన్‌ చేయగా లోన్‌ ఇప్పిస్తామని చెప్పి కావాల్సిన సర్టిఫికెట్లను తీసుకున్నారు. ప్రాసెసింగ్‌ ఫీజు పేరుతో సుమారు రూ.72 వేలు తీసుకున్నారు. డబ్బులు తీసుకుని నెలలు గడుస్తున్నా లోన్‌ ఇప్పించక పోగా ఫోన్‌ చేసినా స్పందించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి శనివారం ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ సైదులు తెలిపారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో జరిమానా

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ ట్రాఫిక్‌ పోలీసులు చేపట్టిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 23 మందిని శనివారం నాంపల్లిలోని నాల్గవ మెట్రోపాలిటన్‌ మేజిస్ట్రేట్‌ కోర్టులో హాజరుపర్చారు. ఒక్కొక్కరికి రూ. 2100 చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు. 2021, 22, 23 సంవత్సరాల్లో పట్టుబడ్డ వీరందరినీ న్యాయస్థానంలో హాజరుపర్చగా వీరి నుంచి జరిమానాల రూపంలో రూ. 48,300 వసూలైనట్లు ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ టి. నరసింహరాజు తెలిపారు.

సీపీఆర్‌పై 3500 మందికి అవగాహన

గాంధీఆస్పత్రి: వైద్యులు, పోలీస్‌, నర్సింగ్‌, పారామెడికల్‌, స్వచ్ఛంద, సామాజిక సేవకులు, వైద్య విద్యార్థులకు మొత్తం కలిసి 3500 మందికి బేసిక్‌ లైఫ్‌ సపోర్ట్‌, సీపీఆర్‌పై శిక్షణ అందించి అవగాహన కల్పించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. గాంధీ అలుమ్నీ అసోసియేషన్‌, గ్లోబల్‌ అలియన్స్‌, అమెరికన్‌ హార్ట్‌ అసోసియేషన్‌ సంయుక్తాధ్వర్యంలో గాంధీ అలుమ్నీ భవనంలో మూడ్రోజుల పాటు నిర్వహించిన సీపీఆర్‌పై అవగాహన శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ గవర్నర్‌ తమిళిసై సీపీఆర్‌ శిబిరాన్ని సందర్శించి అభినందించడం తీపిగుర్తని అలుమ్నీ అసోసియేషన్‌ అధ్యక్షుడు డాక్టర్‌ జీఆర్‌ లింగమూర్తి ఆనందం వ్యక్తం చేశారు. అలుమ్నీ ద్వారా పలు సామాజిక, వైద్యసేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోపాలపురం ఏసీపీ సుధీర్‌, చిలకలగూడ సీఐ నరేష్‌, డీఐ నాగేశ్వరరావుల నేతృత్వంలో పలు ఠాణాలకు చెందిన ఎస్‌ఐలు, పోలీస్‌ సిబ్బందికి అమెరికన్‌ హార్ట్‌ అసోసియేషన్‌ వైద్యనిపుణుడు డెన్నిస్‌మెకాలే సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ రత్నం, వైద్యులు రాజశేఖర్‌, రవీందర్‌ సురకంటి, వేమూరి మూర్తి, మహేశ్వరరెడ్డి, నాగార్జున చక్రవర్తి పాల్గొన్నారు.



పోలీస్‌ అధికారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఓయూకు రూ.100 కోట్ల నిధులు కేటాయించండి



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్‌ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు రూ. 100 కోట్ల నిధులు కేటాయించాలని ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్‌ నేత సత్య మాట్లాడుతూ.. కొఠారి కమిషన్‌ ఇచ్చిన సిఫారసుల మేరకు కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులను కేటాయించాలన్నారు. నిధుల కొరత వల్ల ఓయూ అభివృద్ధి కుంటుపడిందన్నారు. గతంలో ఓయూకు బకాయి ఉన్న శతాబ్ది ఉత్సవాల రూ.150 కోట్లను విడుదల చేయాలన్నారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్‌, నాన్‌టీచింగ్‌ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ సమావేశంలో ఉదయ్‌కుమార్‌, బాలరాజు, హబీబ్‌, శివ, గోపాల్‌, సుమన్‌ పాల్గొన్నారు.

నేషనల్‌ జూట్‌ బోర్డును కోల్‌కతాలో విలీనం చేయొద్దు

బంజారాహిల్స్‌: చేనేత జౌళి శాఖ కార్యాలయంలో కార్మికులు చేస్తున్న ధర్నాకు టీపీసీసీ సీనియర్‌ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ఖైరతాబాద్‌ కాంగ్రెస్‌ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్‌ సి. రోహిణ్‌ రెడ్డి, నేతలు చరణ్‌ కౌశిక్‌ మెట్టు సాయికుమార్‌ సంఘీభావం ప్రకటించారు. హైదరాబాద్‌లోని నేషనల్‌ జూట్‌ బోర్డును కోల్‌కతాలో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసిందని, దీంతోతయారీదారులందరూ భయాందోళనకు గురవుతున్నారని రోహిణ్‌రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన తయారీదారులు నేషనల్‌ జూట్‌ బోర్డు హైదరాబాద్‌పై ఆధారపడుతున్నారని ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని జూట్‌ బోర్డు హైదరాబాద్‌ను కోల్‌కతాలో విలీనం చేయవద్దని మాండ్‌ చేశారు.



హామీలు మరిచిన మంత్రి

వీఆర్‌ఏల జేఏసీ

పంజగుట్ట: తమ సమస్యలు పరిష్కరిస్తామని మునుగోడు ఎన్నికల సమయంలో మంత్రి కేటీఆర్‌ హామీ ఇచ్చి నేటి వరకు ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని, కనీసం తమకు అపాయింట్‌మెంట్‌ కూడా ఇవ్వడంలేదని వీఆర్‌ఏ జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీఆర్‌ఏ జేఏసీ చైర్మన్‌ రాజయ్య, ప్రధానకార్యదర్శి దాదేమియ, కన్వీనర్‌ సాయన్న మాట్లాడుతూ.. వీఆర్‌ఏలు రూ.10,500 వేతనంతో కుటుంబాన్ని పోషించలేకపోతున్నారని, ముఖ్యమంత్రి పలుదఫాల్లో వీఆర్‌ఏలకు ప్రకటించిన పే స్కేలను అమలు చేయాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని 80 రోజులు దీక్ష చేశామని గుర్తుచేశారు. మునుగోడు ఎన్నికల సమయంలో మంత్రి కేటీఆర్‌ తమను పిలిపించుకుని దశల వారీగా వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, సమ్మె విరమించి 100 రోజులు దాటుతున్నా ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. వెంటనే తమ డిమాండ్లు పరిష్కరించకపోతే ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో 48 గంటలపాటు ఇందిరాపార్క్‌ వద్ద మౌనదీక్ష చేస్తామన్నారు. సమావేశంలో కో కన్వీనర్లు వెంకటేష్‌ యాదవ్‌, ఎండీ రఫీ, మాధవ నాయుడు, వెంకటేష్‌, రవీందర్‌, బండారి వెంకటేష్‌, స్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

వరద నీటి పైప్‌లైన్‌ ధ్వంసమైందంటూ ఆందోళన

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ రోడ్‌ నం.10–బిలో ప్లాట్‌ నంబర్‌ 270–ఏ లోంచి జూబ్లీహిల్స్‌కు చెందిన వరద, మురుగు నీటి పైప్‌లైన్‌ ఏర్పాటు చేశారు. అయితే ఈ పైప్‌లైన్‌ను ఆనుకొని ఇటీవల సదరు ప్లాట్‌ యజమాని నిర్మాణ పనులు చేపట్టాడు.సెల్లార్‌ తవ్వకాలతో పైప్‌లైన్‌ దెబ్బతిని మురుగంతా బయటికి వస్తున్నదంటూ స్థానికులు ప్లాట్‌ వద్దకు పెద్ద సంఖ్యలో వచ్చి జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి చేరుకున్న జీహెచ్‌ఎంసీ ఏఈ ప్లాట్‌ లోంచి వెళ్తున్న ఈ పైప్‌లైన్‌కు రెండువైపులా అయిదు మీటర్ల చొప్పున స్థలాన్ని వదిలి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.ఈ తవ్వకాల మూలంగా పైప్‌లైన్‌ ధ్వంసం కావడం వల్ల మురుగు బయటికి పారుతూ దుర్వాసన వస్తోందని, చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్‌ చేశారు. వెయ్యి గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్లాట్‌లో నిర్మాణాలు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–18 నుంచి తాము తీసుకున్న అనుమతుల మేరకే ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని, పైప్‌లైన్‌ను ఏ మాత్రం ధ్వంసం చేయలేదని ప్లాట్‌ యజమాని శ్రీను వైట్ల వెల్లడించారు.



రేపు యూకే అడ్మిషన్స్‌ డే

పంజగుట్ట: యూకేలో ఉన్నత చదువులు అభ్యసించాలనుకునే విద్యార్థులు, సందేహాలు నివృత్తి చేసుకునేందుకు సోమాజిగూడలోని యూని ఎక్స్‌పర్ట్స్‌ కార్యాలయంలో ఈ నెల 30న యూకే అడ్మిషన్స్‌ డే నిర్వహిస్తున్నట్లు సంస్థ ఆపరేషన్స్‌ హెడ్‌ ఉమ తెలిపారు. శనివారం సంస్థ కార్యాలయంలో యూకే అడ్మిషన్స్‌ డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ..అడ్మిషన్స్‌ డే నాడు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని అప్లికేషన్స్‌, వీసా రిక్రూట్‌మెంట్‌, స్కాలర్‌షిప్స్‌ ఆప్షన్స్‌ వంటి అంశాలపై నేరుగా యూనివర్సిటీ ప్రతినిధులతో సంప్రదింపులు జరపవచ్చన్నారు. యూకేకి చెందిన 20 పైగా అంతర్జాతీయ యూనివర్సిటీలు ఈ కార్యక్రమంలో పాల్గొటాయన్నారు. అడ్మిషన్‌ డేలో పాల్గొనే వారు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

ట్రోఫీ అందజేత

ఓయూలో జరిగిన కామర్స్‌ పీజీ విద్యార్థుల మీట్‌–2023 శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్‌ ప్రొ.లక్ష్మీనారాయణ వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ట్రోఫీని అందజేశారు.
– ఉస్మానియా యూనివర్సిటీ




రథసప్తమి వేడుకలు.. ఆలయాలకు బారులు



దర్శనానికి బారులుతీరిన భక్తులు

రసూల్‌పురా: రథసప్తమిని పురస్కరించుకుని కంటోన్మెంట్‌ బోర్డు ఏడవ వార్డు తిరుమలగిరిలోని సూర్యభగవానుని దేవాలయానికి శనివారం ఉదయం ఐదు గంటల నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయం ఆవరణలో ఉన్న సూర్యభగవాన్‌ ఆలయంతో పాటు శివాలయం, మరకత గణపతి దేవాలయం, సరస్వతి ఆలయం, సత్యనారాయణ స్వామి సమ్మక్క సారలమ్మ ఆలయాలతో పాటు గోశాలను భక్తులు సందర్శించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, రాష్ట్ర బెవరేజేస్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ గజ్జెల నాగేష్‌, కంటోన్మెంట్‌ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్‌ తన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి పూజలు చేశారు. అదే విధంగా శ్రీ గణేష్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు శ్రీగణేష్‌ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. తమ ఫౌండేషన్‌ తరపున భక్తుల కోసం తాగునీటి శిబిరం ఏర్పాటు చేశారు.



పూజలో పాల్గొన్న ప్రకాశరావు, కార్పొరేటర్‌ హేమ

చిలకలగూడలో..

చిలకలగూడ: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని చిలకలగూడలోని పలు ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌ నోముల ప్రకాశరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సీతాఫల్‌మండి కార్పొరేటర్‌ సామల హేమ, బీఎస్‌ఆర్‌ గార్డెన్‌ అధినేత బిట్ల రఘునందన్‌, జబర్దస్త్‌ ఫేం శ్రీహరి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసనగర్‌ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని బాలాలయంతో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో రథయాత్ర నిర్వహించలేదని ఆలయ చైర్మన్‌ బసవరాజు శ్రీనివాస్‌, ఈఓ రాజేష్‌కుమార్‌ తెలిపారు.



కుటుంబ సభ్యులతో కలిసి పూజలకు హాజరైన జంపన ప్రతాప్‌